

# వెన్నెల మడుగు

జంటకవుల చక్రపాణి



'అప్పుడే వచ్చావేం సుబ్బులూ' అంటూ లోపలికి వెళ్లింది అమ్మ. బూటు విప్పి 'ఈజీచైర్'లో కూలబడ్డాను. 'సినిమాకు వెళ్తోన్నానని అప్పుడే వచ్చావేరా! ఒంట్లో బాగాలేదా— ఇందా ఈ కాఫీ తీసుకో.' 'అబ్బే లేదమ్మా బాగానేవుంది.' అంటూ కాఫీ తీసుకున్నాడు. ఏంచెప్పాలో పాలుపోక. మధ్యాహ్నంనుంచి మనస్సు మనస్సులోలేదు. హృదయం బ్రద్దలయ్యే బాధ. బజారునుంచి ఇంటికొస్తుంటే రమేష్ ఎదురయి 'అదేమిటి గురూ! ఏమైంది? ఏమిటి సంగతి' అని ఆదుర్దాగా అడిగేంతవరకూ నా కళ్లంబడి నీరు కారుతున్నట్లుకూడా నాకు తెలియదు. 'ఏమిట్రా జేబులో ఉత్తరం— ఎవరు రాశారు.' అని అడిగింది అమ్మ. ఇంక లాభంలేదు అమ్మతో చెప్పితీరాలి. ఆవిడ దుఃఖానికి అంతుండదు. కాని ఈ బాధనంతా నాలోనే దాచుకునే గుండె నిబ్బరం నాలోలేదు. బయటికి వెళ్లగక్కితేనన్నా కొంత మనశ్శాంతి ఉంటుందేమో.

'దీపావళి మనకు అచ్చిరాలేదమ్మా,.....రామయ్య పెదనాన్న దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. 'చక్రం' పదిరోజులనుంచి కనిపించటల్లేదుట. అన్నిచోట్లా వెతికి అందరికీ ఉత్తరాలుకూడా వ్రాశామూ— ఇంకా జాడ.........' ఇంక చెప్పలేకపోయాను. అమ్మ శోకాలే మొదలెట్టింది. ఎంత ప్రయత్నించినా నాకు గుండె నిబ్బరం చిక్కటంలేదు. చక్రం ఏమైనట్లు ఎలా వాడి జాడ కనుక్కోవడం. నిజంగా మానవ జీవితం విచిత్రమైంది. మరీ కొందరి జీవితాలకు అర్థం పర్థంలేకపోగా కేవలం వాళ్ల జీవితాలు విషాదానికి ప్రతిబింబాలుగా తయారవుతాయి.

ఆలోచనలు ఒకదానివెంట ఒకటి కారుమేఘాలలాగా పరుగెడుతున్నాయ్. గుండెల్లో హాహారవం, మెదడులో తుఫాను. మనస్సు గతంలోకి వెళ్లింది.

* * *

రెండేళ్ల క్రిందటిమాట.

ఆఫీసు పనిమీద గుంటూరు వెళ్లిన నాకు 'చక్రధరరావు పెళ్లి— అవనిగడ్డలో— త్వరగా రావలసింది' అని రామయ్య పెదనాన్న దగ్గరనుంచి

'పెత్రిగావ్' వచ్చేటప్పటికి హడావిడిగా బయలు దేరాను. మొదట్లో వాడికేమిటి పెళ్ళేమిటి అనిపించింది. పోనీ అదీ ఒకందుకు మంచిదిదేలే, పెద్ద వాళ్ళిద్దరూ దాటిపోయింతర్వాత వాడికిమాత్రం దిక్కెవరని పెళ్ళికి ప్రయాణం కట్టాను. ప్రయాణం చేస్తున్నంతసేపూ వింత వింత ఆలోచనలు. పెళ్ళి అయితేనన్నా వాడొకదారికి వస్తాడా దారికొచ్చి మనిషవుతాడా అనిపించింది. ఏదైనా వాడికి పెళ్ళంటూ తలపెట్టటంవల్ల ఒక అమాయక స్త్రీ జీవితం నాశనం చేయటల్లేదుకదా అనిపించింది. పాపం వాడుమాత్రం అమాయకుడు కాదూ! నేనంటే ప్రాణమిస్తాడు. వాడితో నాకు పరిచయమైన రోజే నా జీవితంలోని ఒకే ఒక సుదినం. ఆనాడే ఉదయం పదిగంటలకు మొట్టమొదటగా తెనాలి రామయ్య పెదనాన్న ఇంట్లో దిగాం. నా చిన్నప్పుడే చనిపోయిన నాన్న అంటూ ఉండేవాడట, అమ్మతో 'మధురం— నేను పోతూ నీకూ అంటూ మిగిల్చింది ఏమీలేదు. కానీ ఒకటిమాత్రం మర్చిపోకు నీకూ తెలుసనుకుంటాను. అదే తెనాలి రామయ్య సంగతి. వాడు నా గుండె అంటే నమ్మ. నీకేం కావలిసినా ఉన్నంతలో నీకు సాయపడతాడు— అంతే, నేను ఎలాగో అసమర్థుడ్నై. రోజులు గడవటం మరీ కష్టంగా ఉన్న సమయంలో రామయ్యగారి పంచన బ్రతకటానికి తెనాలి వచ్చేశాం. అదీగాక నేను ఫోర్తుఫారం చదువవలసి రావటం, అది మా స్వగ్రామంలో లేకపోవటం ఒక కారణమైంది. రామయ్యగారు మమ్మల్ని చాలా అప్యాయంగా ఆదరించి ఆశ్రయమిచ్చారు.

ఆనాడే చూశాను చక్రధరరావును. హడావిడిగా లోపలకొచ్చి 'మామ్మా....మామ్మా! లక్ష్మి అత్తయ్యకు పంది పిల్లలు పుట్టాయ్' అంటూ భళ్ళున వెళ్ళగక్కాడొక వార్త— రామయ్యగారి ముసలి తల్లితో పక్కవీధిలో ఉన్న వాళ్ళ అత్తయ్య గారి ఇంటినుంచి వచ్చిన చక్రధరరావు. పాపం ఆ ముసలావిడ అసలేపూర్వకాలపు మనిషి, నిజమో అబద్ధమో తెలియని పరిస్థితిలో శోకాలు పెడుతూ వీధిలోపడింది. ఆవిడ పోంగానే పకాపకా నవ్వుతూ 'పిచ్చిముండ నిజమే అనుకుంటోంది' అంటూ నా వంక తిరిగి ఎవరా ఈ కొత్త మనిషి అన్నట్లు అయోమయంగా చూశాడు. చిరిగిన పొట్టిలాగూ వాళ్ళ నాన్నది కాబోలు, ఒక బారాటి చొక్కా. ఇదీ వాడి అవతారం. 'నీ పేరు చక్రధరరావుకదూ' అన్నాను. అవునన్నట్లు తలూపి అక్కడే చిలక్కొయ్యకున్న వాళ్ళ నాన్న సిల్కు చొక్కా తీసుకు పరుగెత్తబోతున్నాడు. 'ఎక్కడికీ పోతున్నావ్' అన్నాను.

'మరి డబ్బుల్లేవుగా.........ఈ చొక్కా ఇస్తే ఆ బతాణి పాపయ్య జేబుడు సెనగలు పెడతాడు.' అంటూ పరుగెత్తబోయేటప్పటికి గుమ్మంలో రామయ్యగారు సాక్షాత్కరించారు, ఆయన ముసలి తల్లితోసహా.

''ఏరా! మామ్మతో ఏమిట్రా కూశావ్? లక్ష్మి అత్తయ్యకు పందిపిల్లలు పుట్టాయా— నాకు గాడిదను పుట్టావు చాలదూ'' అంటూ చేతికర్రతో వాణ్ణి చావకొట్టటం మొదలెట్టాడు. 'వాన్నోయ్! ఇదేం అనసురోయ్. కొట్టి చంపకురోయ్' అని శోకాలు పెడుతున్నాడు. రామయ్యగారికి కోప్పవస్తున్నా కొట్టటం మానటం ల్లేదు. నాకు చెప్పలేనంత జాలేసింది. ఇంక ఏమీ ఆలోచించకుండా రామయ్యగారి కర్రకు అడ్డు పోవటం, ఆయన కర్ర నా తలకొక గాయం చెయ్యటం త్రుటిలో జరిగిపోయాయి. రామయ్యగారు ఒక్కసారి ఆగిపోవటంతో అదునుచూసుకుని 'దొంగవెధవ— నువ్వు నిద్రపోతావుగా— అప్పుడు ఒక్క గుద్దుతో చంపుతా' అంటూ వాళ్ళనాన్నని తిట్టి వీధిలోకి పారిపోయాడు చక్రధరరావు.

'అనవసరంగా నీకు దెబ్బతగిలిందిగా నాయనా' అన్నారు రామయ్యగారు.

'పర్వాలేదులెండి.'

'అండి అనక్కర్లేదు నాయనా ... పెదనాన్నా అంటే చాలు. మీనాన్న నేనూ ఏమీకాకపోయినా ప్రాణ స్నేహితులం. అదృష్టంలేదు. నీ ముద్దూ, ముచ్చట్లు చూసుకోకుండానే రాలిపోయాడు. నేనుమాత్రం మిగిలాను— వీడితో సతమతమై చావటానికి' అంటూ గుడ్ల నీళ్ల గుడ్ల కుక్కుకుంటూ లోనికి వెళ్ళాడు.

'అసలు అలా ఉంటాడేమిటి మామ్మగారూ— చక్రధరరావు' అన్నాను. 'ఏం చెప్పమంటావు నాయనా. అంతా మేము చేసిన పాపం. వాడు చిన్నప్పటినుంచీ అంతే. తండ్రికి ఒక్కగానొక్క కొడుకు. చిన్నప్పటినుంచీ అతి గారాబంగా పెరిగాడు. దానికితోడు మూడో ఏటినుంచి ఏడోఏటి నుంచి వాడికి చెయ్యని జబ్బంటూలేదు. దాంతో ఒళ్ళూ, మెదడూ అన్నీ పాడైపోయినాయ్' అంటూ కళ్ళు వత్తుకుంది.

''చదువుకుంటున్నట్లుకూడా లేదు'' అన్నాను పూర్తిగా తెలుసుకుందామనే కుతూహలంతో.

'చదువేం చదువు నాయనా! వాడికి సరిగ్గా మాట్లాడటమే రాదు. వాడొక పిచ్చి మాలోకం నాయనా!' అంటూ చక్రధరరావును వెదకటానికి కాబోలు వీధిలోకి వెళ్ళింది. ఆవిడ వెళ్ళటం ఆలశ్యం మెల్లగా లోపలకు వచ్చాడు. 'నాకు దెబ్బలు లెక్కలేదురా! పాపం నువ్వేం చేశావ్ వాణ్ణి— అదేరా..... నాన్నగాణ్ణి......పద సెనగలు కొనుక్కుందాం!' అంటూ నన్ను కుర్చీలోంచి లేపబోయాడు. తన వల్ల నాకు దెబ్బ తగిలిందే అన్న ఆలోచన, బాధ చక్రధరరావు మెదడులో ఏ మూలో ఉన్నట్లుంది. వాళ్ళ నాన్నను సంభోధించిన పద్ధతిచూస్తే నవ్వొచ్చింది. మెదడు ఏమాత్రం సరిగా లేకపోయినా మనిషి సంస్కారంమీద ఎంత దెబ్బతీస్తుంది.

'తప్పుకదూ? చొక్కా అమ్మి సెనగలు కొనుక్కొచ్చావ్' అన్నాను. అసలేమంటాడో అని. వాడి వైఖరి చూస్తే నన్నొక్క గుద్దుకు చంపుతాడన్న భయంకూడా లేకపోలేదు. కానీ నేను వూహించని మార్పు అతనిలో కనిపించింది. ఆ చొక్కా అవతల పారేసి నా దగ్గరకొచ్చి, నా తలమీద చిమ్మిన నెత్తురు తన చొక్కాతో తుడవటం మొదలెట్టాడు. నాకు ఆశ్చర్యంవేసింది. మాటల్లోనూ, ప్రవర్తనలోను అంత చిలిపితనం, పిచ్చితనం, అసందర్భం ఉన్న చక్రధరరావుకు కూడా మానవత్వానికి దగ్గరగా ఉన్న కొన్ని వూహలూ,ఆలోచనలు ఉన్నాయ్. నాకు దెబ్బ తగిలిందనీ, అది నొప్పి పెడుతోందనీ, రక్తాన్ని తుడవాలనీ తెలుసు. ఈ జరిగిన సంఘటనలో నాకు తగిలిన దెబ్బ గురించి మామ్మగారికీ, రామయ్యగారికీ జ్ఞాపకమేలేదు. కానీ చక్రధరరావు నా దెబ్బ గురించి ఆలోచిస్తున్నాడు. తాను చేయగల పనిచేస్తున్నాడు— విచిత్రం.

''చక్రం! నేను వద్దనగానే సెనగలు తెచ్చుకోవటం మానేశావేం'' అన్నాను. ఏమిటో వాణ్ణి 'చక్రం' అని పిలవాలనిపించింది. 'ఆ ......అదే మా నాన్నయితేనా — ఒక్క తన్నుతన్ని పోయేవాణ్ణోయ్' అన్నాడు. వాడి వైఖరి వాళ్ళ నాన్నంటేనేకాదు. వాడి వెర్రి వాగుడికి, పిచ్చి చేష్టలకూ అడ్డుపడ్డ ఎవరితోనైనా అంతేనేమో అనిపించింది.


ఒకనాడు చక్రం, నేనూ— ఇంకా కొంతమంది మా వీధి పిల్లలూ కలిసి చెరువులో ఈతకొట్టటానికి వెళ్ళాము. నిజానికి నాకు చాలా తక్కువ ఈతవచ్చు. ఆ చెరువులో ఈదలేను. నేనూ, వాడూ ఆఖరిమెట్టుమీద నుంచుని తతిమ్మా వాళ్ళ ఈతలు చూస్తున్నాం.


'బాబోయ్! పాము' అని అరిచాడు చక్రం. అంతే అదిరిపోయిన వాణ్ణల్లా, కాలుజారి చెరువులో పడ్డాను. ఈతల మజాలో ఉన్న వాళ్ళు చూడనే లేదు. 'ఒరేయ్, మబ్బులు చచ్చాడ్రోయ్' అంటూ చెరువులోకి దూకాడట. రెండు, మూడు గుటకలేసిన మా ఇద్దర్నీ ఎలాగయితేనేం ఒడ్డుకు చేర్చారు. కాసేపయిన తరువాత 'నువ్వుకూడా దూకావేరా' అని అడిగితే 'పిచ్చి వెధవ్వి తమాషాకు పామంటే చెరువులో పడ్డావ్ మరి .... మరి నువ్వు చచ్చిపోతే నేనో అని నిన్ను లాగటానికి దూకానూ' అన్నాడు. తరువాత తెలిసింది— వాడికి ఈత అసలు రాదని. నిజంగా వాడు నాకు ఆనాడు ప్రాణం పోశాడు.


రాను రాను నాకూ వాడికీ మధ్య స్నేహానురాగాలు ఎక్కువ అవటం మొదలెట్టాయి. వాడు ఎంత పిచ్చి వెధవ అయినా, మొండయినా నాలో ఏముందో కానీ నేనంటే ఒక విధమయిన భయం, నేను చెప్పినమాట మీద కొద్దిగా గురి ఉన్నట్లు కనిపించేవాడు. వాడు నాదగ్గర ఎక్కడలేని చనువూ చూసుకుంటూ, కొద్దిగా పొందికగా ఉండేవాడు. కానీ వాడి ప్రవర్తనలోకానీ, మాటల్లోకానీ మార్పు మటుకు ఏమాత్రం తేలేకపోయేవాడిని.

ఏ రోజు కారోజు ఏదో ఒక కాండ చేస్తూనే ఉండేవాడు. పక్కయింటి బామ్మగారి దొడ్లో ఒక జామకాయ కోసుకుంటానని అతి వినయంగా అడిగి, చెట్టుమీదినుంచి పసరు పిందెలతోసహా పాతిక ముప్ఫై కాయలు జేబులో కుక్కుకుని మెల్లగ జారుకునేవాడు.— మా పెదనాన్న స్నేహితులు ఎవరైనా 'హోటల్'కి వెళ్ళటం చూసేవాడు. హోటల్లో ఒక మూల కూర్చుని కావల్సినన్ని మెక్కి మెల్లగా జారుకునేవాడు. ప్రొప్రయిటర్ నిలదీసి అడిగితే 'అదుగోనయ్యా! చీటీ ఆయన కిచ్చాను. ఆయనే ఇస్తాడు,' అని వాళ్ల నాన్న స్నేహితుని వంక చూపించటం,— ఆయన పాపం విధిలేక— మా పెదనాన్నమీద ఉన్న గౌరవం కొద్దీ, బిల్ చెల్లించటం జరిగేది. వాడు అడిగింది కనక ఇవ్వకపోయారంటే బుర్ర రామకీర్తన పాడిందన్నమాటే.

అలాగే వాడి జీవితం పదిహేడు సంవత్సరాలు గడిచిపోయింది. వాడి జీవితంలో అనుకోకుండా ఒక విధమయిన మార్పు వచ్చింది. నూనూగు మీసాలతో, వచ్చీరాని గడ్డంతో ఇష్టమొచ్చినట్లు వీధుల





# వెన్నెల మడుగు

వెంట తిరిగి నానా గొడవలూ, పిచ్చి చేష్టలూ చేసే చక్రాన్ని కొంతమంది నానా మాటలూ అనటం, అప్పుడప్పుడు చెయ్యి చేసుకోవటం కూడా జరిగేది. ఒకరోజు ఏదో రిక్షావాడు రోడ్డుపక్కన రిక్షా ఆపి సిగరెట్ కొనుక్కోటానికి పక్క దుకాణానికి వెళ్ళటం చూసిన చక్రం, మెల్లగా సైకిల్ గాలి తీసేసి పిచ్చిగా నవ్వుకుంటూ పారిపోవడం మొదలెట్టాడుట. అదిచూసిన రిక్షావాడు వాణ్ణి పట్టుకుని చితక్కొట్టేశాడు. పాపం ఆ దెబ్బలను చక్రానికి తీవ్రమయిన జ్వరం, ఒక విధమయిన భయంతోకూడిన కలవరింతలు మొదలెట్టి, నాలుగు రోజుల్లో 'టైఫాయిడ్' జ్వరంగా మారింది. అసలు వాడిమీద ఆశలే వదులుకోవటం చివరికి ఎలాగైతేనేం వాడు ప్రాణాలతో బైటపడటం జరిగింది. కాని ఈ సంఘటన వాడి మనస్తత్వం మీద విపరీతమైన ప్రభావానికి కారణమైంది. ఇదివరకున్న చిలిపితనం, గడుసుదనం పిచ్చి వాడిలో నశించిపోయింది. ఎవరినీ ఏమీ అనడు, ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడడు. అయోమయంగా, అమాయకుడిలా ప్రశాంతంగా కాలం గడపటం అలవాటయింది. అమాయకత్వం ఎక్కువైనా తక్కిన తప్పు, వాడిలో ఇదివరకు ఉన్న పిచ్చి లక్షణాలూ, గడుసుతనం పూర్తిగా లేకపోవటం వీడికి పెళ్ళంటూ జరిగితే ఇంకాస్త దారికొస్తాడేమో అన్న సంకల్పం రామయ్య పెదనాన్నగారికి ఆ మధ్యే వచ్చింది.

* * *

సాయంత్రం ఆరుగంటలయింది.

అవనిగడ్డలో బస్ దిగి పెళ్ళి ఇంటికి రిక్షా మాట్లాడి బయలుదేరాను. సరిగ్గా అప్పటికి లగ్నానికి రెండు గంటల వ్యవధి ఉంది. రిక్షా ఒక ఫర్లాంగు దూరం నడిచిందో లేదో లక్ష్మీపతి మామయ్య ఎదురయ్యాడు. ఒకళ్ళొకరు చూసుకుని ఆశ్చర్యపోయాను. 'ఏరా సుబ్బులూ— కులాసా, పద పోదాం' అంటూ దారితీశాడు.

'కులాసాయే' అంటూ నవ్వగానే కాని, ఈ సంఘటనకు నాకు మతిపోయింది. ఏమిటి ఈ తమాషా. జీవితంలో మళ్ళీ కలుసుకోననుకున్న మామయ్యతో అనుకోని తలంపుగా కలుసుకోవటం జరిగింది. మామయ్యకు అవనిగడ్డలో ఏమిటి పని— కొంపతీసి ఈయన కూడా పెళ్ళికని రాలేదుకదా ? అయినా రామయ్య పెదనాన్నకూ ఈయనకూ పరిచయంకాని, బంధుత్వంకాని లేదే. ఏమిటో— ఆలోచనలకు అంతులేకుండా ఉంది. ఒకదానికీ, ఇంకొకదానికి సంబంధంకనిపించటంలేదు.

“ఏమిట్రా ! అంత పరాకుగా నడుస్తున్నావ్, ఇంత అకస్మాత్తుగా కలిసామేమిటా అని ?” అని పొడిగా నవ్వాడు. 'శేషమ్మకే పెళ్ళిరా, రామయ్యగారి అబ్బాయికీ— నువ్వొస్తున్నావని వాళ్ళ ఫోన్లోనేటుగా ఉండటం. నాకూ మొన్ననే తెలిసింది'— అని పాలిపోయిన మొహంతో చెప్పుకుపోతున్నాడు. అంతా మన చేతిలో ఉందని విడిచినపడి, చివరకు విధి అనే సంకెళ్ళతో కట్టుబడిపోయే అల్పమానవుని దీన పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది అయన

ముఖంలో. ఏమిటో మళ్ళీ ఆలోచనలూ— ఏటికి అంతుపొంతూ కనిపించదు.

నిజంగా— చిన్నతనం ఎంత సరదాగా గడిపాం 'నాగూ' నేనూ, స్కూల్లో నేను ఐదో క్లాసు చదువుతుండగా అది అక్షరాలు దిద్దుతుండేది. అప్పటికి నాకు పదో ఏడు, దానికి ఆరో ఏడూ. కొద్ది కాలుబారుతనంతో పదకొండు— పన్నెండు ఏండ్ల వాడిలాగా కనిపించేవాణ్ణి. రోజూ ఏదో ఒకటి కొనుక్కొని నాకు పెట్టందే తినేదికాదు. లక్ష్మీపతి మామయ్య కూతురు— శేషుమణి. దానికి చిన్నప్పటినుంచి ముక్కుమీద కోపముండేది. అందుకే అది తాచులాగా ఉంటుందని 'నాగూ' అని పిలిచేవాణ్ణి. మొదట్నుంచీ దాంది అదే మనస్తత్వం. ఆరు నూరైనా నూరు ఆరైనా దాని మనస్సుకు తోచింది జరగాల్సిందే. కోరిక నెరవేరాల్సిందే.

లక్ష్మీపతి మామయ్యా మేమూ, మా స్వగ్రామంలో అదే మగ్రిపాలెంలో ఒకే వీధిలో ఉండేవాళ్ళం. మామయ్య బాగా ఉన్నవాడనే చెప్పాలి. ఎనిమిదెకరాల మాగాణీ, రెండు మామిడి తోటలూ ఇదికాక కోర్టు లావాదేవీలూ— అంతా ఘనంగా ఉండేది ఆ రోజుల్లో. వస్తుతహా మాకు పెద్దగా ఆధారంలేకపోయినా, ఏదో మామయ్య మమ్మల్ని అప్పుడప్పుడు కనిపెడుతూనే ఉండేవాడు. మా ఇంటి చుట్టుపట్ల వాళ్ళందరూ నాగూ నేనూ కలిసిమెలిసి తిరగటం, ఒకేచోట ఆడుకోవటం చూసి, 'ఈడూ జోడూగా ఉంటారమ్మా పిల్లలూ ఇద్దరికీ ముడేస్తే చూడముచ్చటగా ఉంటుంది' అనుకోవటం విని మాకు ఎక్కడలేని సిగ్గు ముంచుకొచ్చేది.

* * *

విడిది పందిట్లోకి తీసుకెళ్ళాడు లక్ష్మీపతి మామయ్య నన్ను. 'అనుకోని తలంపుగా నిమిషాల మీద నిశ్చయమయింది రా సుబ్బులూ— టెలిగ్రామ్ అంది వేళకు వస్తావో రావో అని ఎంత బెంగ పడిపోతున్నానో' అంటూ ఆప్యాయంగా ఎదురైనాడు రామయ్య పెదనాన్న.

'ఏరా పెళ్లికొడకా! నాతో చెప్పకుండానే పెళ్లి చేసుకుంటున్నావే?' అన్నాను— చక్రాన్నిచూసి పలకరిస్తూ. వాడికి సమాధానం ఏం చెప్పాలో తోచక తలముఖంవేసి లోపలికెళ్లిపోయాడు నవ్వుకుంటూ. 'స్నానంచేసి రెండు మెతుకులు తినరా సుబ్బులూ— ప్రొద్దునవగా ఎప్పుడు తిన్నావో ఏమో' అంటూ పలకరించింది సీతదొడ్డమ్మ. సరే అన్నీ కానిచ్చుకుని తయారయేటప్పటికి వధూవరులు పీటలమీద కూర్చోవటం జరిగింది. అబ్బ ఎన్నాళ్లకు శేషుమణిని చూడటం జరిగింది. తలవొంచి పొందికగా కూర్చుందేగాని— నాకోసం పందిరంతా గాలిస్తూనే ఉంది, అప్పుడప్పుడు మెల్లగా దించిన తలయెత్తి ఓరగాచూస్తూ. ఇద్దరి కళ్లూ సూటిగా కలుసుకున్నాయ్. కానీ— ఆమె చూపులోకానీ, ముఖంలోగానీ ఏ విధమైన అనుభూతినీ పసికట్టలేకపోయాను. ఆ పెళ్ళిపీటలమీద వింత శోభతో కనిపిస్తోందామె. కొట్టొచ్చినట్లు కనపడే ఆ ముక్కు.

నాకు బాగా జ్ఞాపకం. మా చిన్నతనంలో ఒకసారి తిరుపతికి వెళ్లాం. అప్పుడు నాకు మొక్కుండటంవల్ల ఒక పెద్ద జెడుండేది. అంతకు పదిరోజులు క్రిందటే 'నాగూ'కు మోపిదేవిలో గుండు చేయించారు సన్నటి గుండూ అది చూడటానికి తమాషాగా ఉండేది. 'ఏయ్! గుండూ— పంపర పనసకాయ్' అని నేను ఎగతాళిచేస్తే 'నువ్వున్నావులే— బండ బావవి. ఇంత జడా నువ్వూనూ' అంటూండేది. నేనూ నాగూ పెద్ద తిరుపతిలో సత్రం డాబామీద ఉండి ఏదో మాట్లాడుకుంటుంటే, మా అమ్మ మెల్లిగా నాగూను దగ్గరకు తీసుకుని— 'ఏమే పిల్లా— దేవుడికి ఏమని దణ్ణం పెట్టా' అనడిగితే 'వెంకటేశ్వరస్వామీ! నాకూ మా సుబ్బులు బావకూ పెళ్లయేటట్టు చూడు నాయనా అని దణ్ణంపెట్టానత్తా' అన్నది అమాయకంగా ముఖంపెట్టి నాకూ, మా అమ్మకూ నవ్వాగలేదు. మా నవ్వులుచూసి నాగూకి సిగ్గూ, అభిమానమూ వచ్చి ముఖమంతా కందగడ్డయిపోయింది. అప్పటి దాని కోపంతోకూడిన ముక్కు కళ్లకు కట్టినట్టు కనిపించింది.— మనస్సు చివుక్కుమంది.

పురోహితుడు ధారాళంగా మంత్రాలు చదువుతూ యధావిధిగా అన్నిపనుల్లా చేయిస్తున్నాడు. 'బాజాభజంత్రీలు వాయించండి' అంటున్నాడు మధ్య మధ్యలో. చక్రానికి ఉన్నట్టుండి పురోహితుడిమీద ఎందుకో కోపం వచ్చింది. ఇప్పుడు అక్కడ ఏంచేస్తాడో అని ఖంగారుపడ్డాను.

ఒకనాడు రామయ్య పెదనాన్న వాళ్ళు 'పాండవోద్యోగ విజయం' నాటకం వేస్తున్నారు. పెదనాన్న అందులో దుర్యోధన పాత్రధారి. ఆయన చొక్కా, చేతి కర్రా, చిల్లర డబ్బులూ పట్టుకుని చక్రం స్టేజీమీద 'సైడ్‌వింగ్'లో నుంచుకుని ఉన్నాడు. 'దుర్యోధన సార్వభౌముడు యుద్ధంలో తొడలు విరిగి పడిపోవటం— భీమసేనుడు దుర్యోధనుడి కిరీటం మీద మామూలు ప్రకారం ఒకతాపు తన్నటం జరిగింది. ఇదిచూసిన చక్రానికి వళ్లు మండింది. 'మా నాన్నను తలమీద తంతావురా వెధవా' అని అమాంతం స్టేజీమీదకు వచ్చి— భీమసేన పాత్రధారిని కర్రతో అదిరిపోయేట్టు కొట్టాడు. ఆనాడు వాణ్ణి ఆపలేక మాపనయింది. అది జ్ఞాపకమొచ్చినప్పుడల్లా నాకు నవ్వాగదు అందుకే వాడికి కోపం వచ్చిందంటే ఏమిచేస్తాడో అన్న భయమే.

పీటలమీద వధూవరుల స్థానాలు మార్చటానికి కాబోలు త్రిపురాంబత్తయ్య వచ్చింది. 'మహా ఇల్లాలు! ఎన్నాళ్టికి దర్శనమిచ్చావు తల్లీ' అనిపించింది. నిజంగా ఆ రోజుల్లో నా పాలిట రాక్షసై కూర్చుంది. నాకు పెద్దగా ఆస్తిలేదూ— అదీగాక చదువు తొందరగా ఎక్కిరాలేదూ అన్న ఉద్దేశం ఉన్నా— ఆ రోజుల్లో మామయ్యకు నేనంటే సదభిప్రాయమే ఉండేది. కానీ, ఈ త్రిపురాంబగారికి మా కుటుంబమంటే ఎక్కడలేని చులకన, అసహ్యం. కారణం తనకున్న డబ్బు తనకిచ్చిన అహంభావం. మమ్మల్ని గడ్డిపోచగా చూసేది. మామయ్య ఆవిడ చేతిలో కీలుబొమ్మ. ఆమెచెప్పిన మాటకు ఎదురు చెప్పే జబ్బు ఆయనకు చస్తేలేదు. చెప్పొద్దూ ఆ రోజు ఇంట్లో పెద్ద వాన కురిసి వెలిసిందన్నమాటే. వారికి— ముఖ్యంగా త్రిపురాంబత్తయ్యకు ఇష్టం లేకపోవడంతో ఆ రోజుల్లో మా పెళ్లికి స్వస్తి చెప్పడం జరిగింది.

కాని చాలారోజులు 'నాగూ' చేసిన అల్లరికి అంతూపొంతూలేదు. సరిగ్గా తిండితినేదికాదు. ఎప్పుడూ ఏడుస్తూ కూర్చునేది. వాళ్ల అమ్మ ఎంత చెప్పినా వినేదికాదు. ఇలాగే దాదాపు ఒక ఏడాదిదాకా గడిచిపోయినా 'నాగూ'లో మార్పు కనిపించకుండా— నా కంటిచూపుకే నం, నా నోటి మాటకోసం తపనపడేది కాస్తా— 'సడన్'గా మారిపోయినట్లనిపించింది. మామీదా, మా ప్రసక్తిమీదా ఇష్టం చాలా కొద్ది కాలంలోనే తగ్గిపోవడానికి కారణం తెలియక చాలా మధనపడ్డాను. అసలు అడుగంటే స్థితిని వూహించుకోలేక నాలో నేనే నేనే కృశించిపోయేవాడిని ఇదంతా నేను 'థర్డ్ ఫామ్' చదివే రోజుల్లోనిమాట. తరువాత తెల్సింది— 'నాగూ' వాళ్ల ఇంట్లో పనిమనిషిద్వారా మా అత్త ఏదో మందుపెట్టి నాగూ మనసు విరిచేసిందని. ఈ సంఘటన జరిగినకొద్ది కాలానికే ఉన్న వూరు వదలి తెనాలి వచ్చాం.

పెళ్లి యధావిధిగా జరిగిపోయింది. అక్కడ వున్నంతసేపూ ఏమిటో ముళ్లమీద ఉన్నట్టు ఉంది. అర్జంటు పనువ్నాయంటూ తెనాలికి మూడో నాడే ప్రయాణం కట్టాను. 'బస్‌స్టాండు'దాకా సాగనంపటానికి వచ్చిన లక్ష్మీపతి మామయ్య నేను బస్సు ఎక్కే సమయానికి 'ఏమిటో— మొహాన రాసిపెట్టిలేదు. నిన్ను కలుపలేకపోయాను' అని ఆవేదనగా నన్ను దగ్గరకు తీసుకుని కావిలించుకున్నాడు. బజార్లో ఎవరైనా చూస్తారేమో అనిపించి నాకు తెగ సిగ్గేసింది.


'అదేమిటి మామయ్యా? ఇప్పుడు జరిగిన తక్కువేమిటి— అంతా సవ్యంగానే జరిగిందిగా— అదేం మనస్సులో పెట్టుకోకు' అన్నాను.

'ఆఁ ........ఏం సవ్యమో' అంటూ తన్లోతను గొణుక్కున్నాడు. కారు కదిలింది.

ఏమిటో పిచ్చివాడు అనిపించింది. అక్కడ పెళ్లిలో ఉన్నంతసేపు రామయ్య పెదనాన్న వాళ్ళ వాళ్ళు నా వరాకు చూసి ఏమీ తోచక అర్థంకాని స్థితిలోపడ్డారు. పెళ్ళయిన మర్నాడు కాఫీ ఫలహారాల గదిలోకి వెళ్ళాను మామయ్య పిలుస్తున్నాడూ అంటే. తీరా అక్కడికెళ్లి చూసేటప్పటికి గోడనానుకుని కిటికీలోంచి బైట చెరువు కట్టవేపు చూస్తూ 'నాగూ' కాదు—'శేషుమణి' నిలబడి ఉంది.

'ఏం బావా! రావేమో అనుకున్నాను' అంది.

''నిజంగా మామయ్యే పిలిచాడనుకుని వచ్చాను''



న్నాను. వివాహాలోకానికి. 'అయితే నే వేసిన అట్టు సరిచేసిందన్నమాట' అంది. 'ఎలాగైనా తెలివిగలదానివికదా' అన్నాను ఎందుకో నవ్వువచ్చింది.

'అదేమిటి సుబ్బులూ— అలా మాట్లాడుతున్నావ్' అంది విస్మారంగా. పాపం పిచ్చిది. ఇంకా నామీద సదభిప్రాయం పూర్తిగా అడుగంటలేదు.

'ఏంలేదు వస్తా శేషుమణీ— తలనొప్పిగా ఉంది' అంటూ బారుకోబోయాను. వాళ్ళమ్మ ఇప్పుడు మేమిద్దరం మాట్లాడుకోవటం చూసిందంటే— ఇంకా సంభాషణ పొడిగిస్తే ఏ మొస్తుందో అనే నా భయం.

'నీవు నన్ను పిలవటంలోనే తెలుస్తోందిలే బావా నీ హృదయంలో నా కింక ఏమాత్రం చోటులేదని మహానుభావులు.'

'కాని నేను గతాన్ని అంత త్వరగా మర్చిపోలేను— భవిష్యత్తులోనూ, ప్రస్తుతంలోనూ ఆదగవలసింది, జరుగుతున్నది ఎంతో ఉన్నా కూడా! అంతవరకూ ఎటో పరధ్యానంగా ఉన్న నేను శేషుమణి వంక తిరిగాను. ఆమె తలవంచుకుని కాలి బొటన వ్రేలితో నేలమీద అర్ధచంద్రాకారాలు చేస్తోంది. ఇంక ఉండబట్టలేకపోయాను.

'ఇంతకీ నారాయణ్ని ఈ సంబంధం చూడటంలో ఉద్దేశ మేమిటి' అన్నాను. ఏం అడగాలో కూడా తెలియలేదు. ఒంచుకున్న తల అలాగే ఉంచి కొద్ది సేపు యేమీ మాట్లాడలేదు. నిశ్శబ్దాన్ని భరించలేక పోయాను.

'నాన్న పెట్టిన 'లాంగ్ బిజినెస్' మా జీవితాలకి ఒక చిన్న పాఠం నేర్పింది. దాని ఫలితాలే— ఉన్న ఎవిమిదికరాల పొలం అమ్మటం— తిండి గుడ్డకు కూడా మొహం వాచిపోటం— సరే ఈ ఆదాయాలు లేనినా వి.. . వా. . . హుం' ఇంక చెప్పలేకపోయింది.

'అయితే మాత్రం ఇటువంటి సంబంధం...' అని సగంలోనే ఆగిపోయాను. శేషుమణి అభిమానం దెబ్బతిన్నట్టుంది. 'ఏం ఈ సంబంధానికి వచ్చిన నష్టమేమిటి— బాగా ఉన్న వాళ్ళు— చదువు లేనంత మాత్రాన' అని పొడిగా అని వూరుకుంది. 'సరే— చాలా సంతోషం వస్తా' అని బైటపడ్డాను.

శేషుమణికి కానీ, మామయ్యకు గానీ చక్రం విషయాలు పూర్తిగా తెలియువన్న మాట. పాపం

# వెన్నెల మడుగు

మామయ్య పెదనాన్న అన్నా యేమీ చెప్పక పోవడ మేమిటి. ఆయన్ననీ ఏం లాభం. ఆ పరిస్థితిలో ఎవరున్నా అలాగే ప్రవర్తిస్తారేమో అనిపించింది.

రెండు మూడు నెల్ల తరువాత హైదరాబాద్‌లో పని చేస్తున్న నాకు ఒక ఉత్తరం వచ్చింది. చించి చూశాను. ఆశ్చర్యం శేషుమణి వ్రాసింది.

'ప్రియమైన బావకు— వ్రాయునది. కుశలా మనే అనుకుంటాను. నా జీవితం మొత్తానికి ఇలా ఉంటుందని నేను వూహించక పోయినా— నీవు నన్ను పెళ్ళి పీటల మీద చూసిన రోజే వూహించి ఉంటావు. ఇక్కడ మా వారు నన్ను 'ఏయ్ ! అమ్మాయ్' అనో 'ఏమండీ' అనో పిలుస్తూ ఉంటారు. నా మీద నీకు జాలిగా ఉంది కదూ— ఎవరి మొగుడికి ఎవరు భార్యలు బావా ?— మొన్న మధ్య ఒక సంఘటన జరిగింది. 'నీ పెళ్ళానికి కాస్త అవీ ఇవీ పెడుతూ కాస్త చనువు చేసుకోవయ్యా' అని వీధిలో వాళ్ళు ఎవరో చెప్పారుట. ఇంకేముంది. మా చిన్నిగారు— అదే మా అత్తగారు నోరు చేదుగా ఉందని కాసిని ద్రాక్ష పళ్ళు తెచ్చి గూట్లో పెట్టుకున్నారుట. అవ్వి మెల్లగా సంగ్రహించి, దొడ్లో పని చేసుకుంటున్న నన్ను చూసి, ఆ సందులో నుంచే 'ఏయ్ ! అమ్మాయ్— పళ్ళు— తిను పళ్ళు—' అనటం— ఈ 'సీన్' దొడ్లో ఉన్న పాలేరూ, పనిమనిషీ చూసి విరగబడి నవ్వడం. జరిగిన దానికి ఉరోసుకు చావాలనిపించింది. ఇటువంటి సంఘటనలు మా ఇద్దరి జీవితంలో కోకొల్లలు— ఈ జీవితమంటే రోతగా ఉంది. ముఖ్యంగా— తను కూడా నలుగుర్లో ఒక పెళ్ళాంకి భర్త అని చాటి చెప్పుకోడానికి చేసే ప్రవర్తనకు తట్టుకోలేకుండా ఉన్నాను— దీనికేమిటి మందు— సరే ఇదంతా దాని నిన్నెందుకు విసిగించడం. ఏలుంటే ఒకసారిరా సుబ్బులూ — యిక ఉంటా— నీ ప్రియమైన నాగూ !'

ఉత్తరం చదివేటప్పటికి కళ్ళంబడి నీళ్ళు గిర్రున తిరిగాయ్. ఆమె చెప్పినట్టు ఎవరి జీవితానికి ఎవరు భాద్యులూ అని ఒక నిట్టూర్పు విడవడం తప్ప ఏమీ చేయలేక పోయాను. ఇది ఎవరి తప్పని చెప్పాలి. ఏమీ తెలియని చక్రంది తప్పా ? తన సంతానం సంతోషం కోసం ప్రాకులాడే మామయ్య పెద్ద వాన్నంది తప్పా ? ఎవరు చెప్పాలి దీనికి సమాధానం.

బాహ్యంగా కొందరి ప్రవర్తన బాగున్నా, అసహ్యంగా కనిపించినా — అంతరంగికంగా నిష్కల్మషమైన అనురాగ గుచ్ఛం వికసించి ఉంటుంది. ఆ మూగ హృదయం వ్యక్తం చేయలేని పవిత్ర రాగపు తంత్రులను పరికించడానికి మరో మూగ మనసే కావాలి.

దీపావళి మూడు రోజులుందనగా తెలిసింది. శేషుమణి తెనాలిలోనే ఉండే ఒక కుర్రవాడితో లేచిపోయిందని. ఈ సంఘటన వాడిలో చాలా మార్పుకు కారణ మయింది. ఉక్కుపిండం లాగా ఉండేవాడు క్షీణించి పోవటం మొదలెట్టాడు. ఇంట్లో వాళ్ళూ, వూళ్లో వాళ్ళు మాటల సందర్భంలో వాడి పెళ్ళాం లేచిపోటం గురించి చులకనగా మాట్లాడే తీరు వాడి మనస్తత్వం మీద తీవ్రమైన ప్రభావానికి కారణమైంది. వాడెప్పుడైనా అలిగితే 'పోరా వెధవా ! భార్యను ఏలుకోలేని వాడివి — లోకం మీద పడితేనావ్' అని రామయ్యగారు కూడా అప్పుడప్పుడు విసుక్కోవటం జరిగేది. భార్య లేచిపోవటం అంటే తనకేదో లోపమైందని, అది జరగ కూడని పని అని, వాడేదో వ్యక్తిగతంగా ఫీల్ అవడం మొదలెట్టాడు. ఆ ఒక్క ఆలోచనా వాడి మెదడుకు తీవ్రంగా గాయపరచి, చాలా సందర్భాలలో వాడికి ఇది వరలో ఉన్న మనస్థిమితాన్ని కూడా లేకుండా చేశాయ్. అంతే— అలాగే రోజులూ వారాలూ, నెలలూ గడిచాయ్.

* * *

ఈ రోజు ఈ వార్త ఒకటి పిడుగులాగా వచ్చి పడింది. చక్రం కోసం ఎక్కడని వెతికేది. ఎలా వాణ్ని కనుక్కోవడం — వాడు లేని నా జీవితం— ఇంక వూహించలేను.

'చీకటి పడుతోందిరా సుబ్బులూ — ఏదో బొత్తిగా వూరుకోకుండా ఒక కాకర పువ్వొత్తి అన్నా వెలిగించి— రెండు బజ్జీలు నోట్లో వేసుకోనాయనా' అని పిలిచింది అమ్మ. కాఫీ త్రాగివద్దామని వంటు మలుపు తిరుగుతుంటే ఎవరో దారిన పోయేవాళ్ళు, ఒక పిచ్చివాలకం మనిషి నా పేరుతో అడుగుతున్నాడు, పరిచితమైన గొంతు. ఎవరా అని చూశాను. అదే సమయంలో పక్కింటి అరుగు మీద కూర్చుని టపాకాయలు కాలుస్తున్న కుర్రాడి చేతిలోని 'వెన్నెల మడుగు' కాంతి ఒక్కసారి ఆ పిచ్చివాలకం మనిషి మీద పడింది. వాడే— సందేహం లేదు— నా 'చక్రం'— నా ప్రాణం. ఎవరి కోసం అయితే నా మనస్సు ఇన్నాళ్ళూ పరితపించి పోయిందో, వాడే— నాకు మళ్ళీ దక్కాడు. ఇంత దూరం ప్రయాణం చేసి ఎలా వచ్చాడన్న విషయం నా వూహా కందనిది. విచిత్రం ఎవరు అలవాటు చేశారో యేమో. 'చక్రం' ఇప్పుడు సిగరెట్, బీడీ, చుట్ట— ఏదో ఒకటి, ఏది దొరికితే అది త్రాగందే క్షణం ఉండలేడు.

పోనీ— ఏది ఏమైనా— నా చక్రం నాకు దక్కాడు. ఆ వీధిలోని పిల్లవాడు తన 'వెన్నెల మడుగు'తో నా హృదయమంతా వెన్నెలతో నింపాడు. ★

